## పేరు మీరే పెట్టండి

**అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.**

మా స్నేహితుడి కుమార్తె పెళ్ళయితే వైజాగ్ బయలుదేరేను ట్రెయిన్లో. ముహూర్తం తెల్లవారుఝామున కావడంతో రాత్రి ప్రయాణం తప్పలేదు.

కంపార్టుమెంటునిండా ఒకటే జనం. బ్రీఫుకేసును బెర్తుకిందికి తోసి, స్థిమితంగా నిలబడి ప్రయాణీకుల్ని పరిశీలిస్తున్న నా దృష్టి, ఎదురుగా కూర్చుని సేఠ్‌జీతో కబుర్లు చెబుతున్న వ్యక్తిమీద పడింది. సఫారీడ్రస్, రిమ్‌లెస్ కళ్ళజోడు, నోట్లో సిగరెట్‌తో పరిచయమున్న ముఖంలా వున్నాడు. 'వీడు కేశవరావు కాదుగదా' అని పరిశీలించి చూశాను. కేశవరావే. హైస్కూలురోజుల్లో నా క్లాస్‌మేటు.

"ఎక్స్‌క్యూజ్‌మి! మీరు కేశవరావు కదూ!" అన్నాను ఏకవచనంతో సంబోధించడానికి ధైర్యంచాలక. అతడు ఓ నిముషం చూసి 'కాదండీ' అన్నాడు.

"మీరు వెంకటాపురం హైస్కూల్లో చదవలేదూ?" సందేహ నివృత్తికోసం అడిగాను మళ్ళీ. "లేదుసార్, మాది హైదరాబాదు. నా ఎడ్యుకేషన్ అంతా అక్కడే జరిగింది" స్టయిల్‌గా అన్నాడు.

ఎప్పుడో పదిహేనేళ్ళక్రితం చూశాను వాడిని. అతగాడిని మళ్ళీ పరిశీలించి చూశాను. సేఠ్‌జీతో కులాసాగా కబుర్లు చెబుతున్నాడు. మాట్లాడుతూ, మాట్లాడుతూ మధ్యలో తల ఎగరేసే ఆ పద్ధతి, ఆ నవ్వు అచ్చు కేశవరావులానే వున్నాడు. షర్ట్ కాలర్ ప్రక్కకు పోవడంలో గొంతుకింద వున్న పెద్ద పుట్టుమచ్చ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సందేహం లేదు. వీడు కేశవరావే. కాని నన్ను ఎరగనట్లు నటిస్తున్నాడు ఎందువల్లో

కేశవరావు వాళ్ళ అమ్మా నాన్నలకు గారాలబిడ్డ. వాళ్ళ నాన్న అప్పట్లో ఏదో చిన్న ఉద్యోగం చేస్తూవుండేవాడు. కేశవరావు స్కూలు ఫైనల్‌కొచ్చేనాటికి వాళ్ళ నాన్న రిటైరయ్యాడు. వెనక ఆస్తిపాస్తులేమీ లేకపోవడంతో కుటుంబం జరగడమే కష్టమైపోయింది. పైగా పెళ్ళీడు దాటిపోయిన ఆడపిల్లలు. ఈ దిగులుతోనే మంచమెక్కిన వాళ్ళ నాన్న రిటైరయిన ఏడాదికే చనిపోవడంతో వీడి చదువు స్కూలుఫైనల్‌తోనే ఆగిపోయింది. తర్వాత కొన్నాళ్ళకు వాళ్ళ కుటుంబం మా వూరు వదిలి వెళ్ళిపోయింది.

రైలు పెద్ద కుదుపుతో వాల్తేరు స్టేషన్లో ఆగడంతో గతంలోనుండి ఇహంలోకి వచ్చిపడ్డాను. దిగాల్సిన ప్రయాణికులు తమతమ సామానులు తీసుకుని దిగే హడావిడిలో వున్నారు. సేఠ్‌జీ ఎందుకో కంగారుగా వున్నాడు.

"ఏమయింది సేఠ్‌జీ?" అన్నాను.

"నాది సూట్‌కేసు కనిపించడంలేదుసాబ్" అన్నాడు దిగులుగా. "ఎక్కడికి పోతుంది? సరిగా చూడండి" అన్నాను. "సరిగానే వెతికాను సాబ్. చల్లగాలికి కునుకుపట్టేసింది. అదనుచూసి ఎవడో దొంగవెధవ కాజేసివుంటాడు" అన్నాడు ఏడుపుగొంతుతో.

"సేఠ్‌జీ! ముందు స్టేషన్‌లో, నీ ప్రక్కన కూర్చున్న కళ్ళజోడు వ్యక్తి సూట్‌కేసు తీసుకుని దిగిపోయాడు. ఆ సూట్‌కేసు అతనిదే అనుకున్నా" చావు కబురు చల్లగా చెప్పాడు ఎదుటి బెర్తుమీద కూర్చున్న ఓ ముసలతను.

అప్పుడు చూశాను కేశవరావు కూర్చున్న వైపు. అతగాడు లేడు. నిజమే. ఈ హడావిడిలో ఆ విషయమే గమనించలేదు నేను. వాడు నన్ను ఎందుకు గుర్తుపట్టనట్లు నటించాడో నాకప్పుడర్థమైంది.

**– ఎం. అంజిరెడ్డి**
(పొదలకూరు)

*స్రవంతి నెం: 14లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత్రి కె.జె. ప్రమిద పెట్టిన పేరు: హైద్రాబాద్ (కాకి) కథ*

## ఈ వారం గెస్ట్ ఎడిటర్
## సాయిచంద్



తెలుగు టి. వి. కోసం హైదరాబాద్ పల్లకి ఆఫీసులో షూటింగ్ జరుగుతూండగా మల్లాది గారు కబురు పంపించారు. అయిదు నిముషాలు గాప్ రాగానే స్రవంతి ఆఫీస్‌లోకి గెంతాను. ''గోపీచంద్ గారబ్బాయీ, ఈ వారం గెస్ట్ ఎడిటర్‌వి నువ్వే'' అన్నారు మల్లాది. ఎడిటింగ్ అంటే ఏమిటని అడగబోయి ఊరుకున్నాను. నా మొహానపడేసిన ఏడు వందల కథల్ని తిరగేయటానికి ఏడు రోజులు పట్టింది. భలే తమాషాగా వున్నాయి కథలు. చివరికి నాకు నచ్చాయి (?) అనుకున్న రెండు కథల్ని మద్రాసు నుంచి విమానంలో పంపేశాను.


ఓ. కే. మళ్ళీ టి. వీ. లో కలుద్దాం త్వరలో!

విరా
సాయిచంద్

## పాపం సుధీర్!

సుధీర్ మనసు గందరగోళంగా వుంది. భార్య తన అలవాట్లు, తిరుగుళ్ళు సహించలేక పుట్టింటి కెళ్ళిపోయి ఆరు నెలలు కావస్తూంది. గర్ల్‌ఫ్రెండ్ మానస నెల తప్పానంటూ త్వరగా పెళ్ళిచేసుకొమ్మని ఒకటే గొడవ. భార్యతో వ్యవహారం ఒక కొలిక్కి రాకుండానే మానసతో జీవితం ముడిపెట్టుకోవడం ఎంత మాత్రం యిష్టంలేదు సుధీర్‌కి. తర్వాత ఎటుపోయి ఎటొస్తుందో అనే భయం వుంది సుధీర్‌లో. అదీ కాకుండా భార్య

## స్రవంతి నెం: 12లో ఇచ్చిన "విడాకులే ముందు.... పెళ్ళి తర్వాత" ఖచ్చితంగా చెప్పాడు సుధీర్. వాక్యం ఆధారంగా రాసిన కథలు




పేరిట చాలా ఆస్తులున్నాయి. విడాకులు తీసుకుంటే వాడికి నీళ్ళు వదులుకున్నట్లే! తన అలవాట్లను భార్య ఏదో ఒక రకంగా భరిస్తుందిలే అనుకున్నాడు కాని, దాచి ముఖాన కొట్టినట్లు పుట్టింటికి వెళ్ళికూర్చుని విడాకుల నోటీసు పంపిస్తుందని ఊహించలేకపోయాడు.

సుధీర్ రూమ్‌కు వచ్చింది ఆ రోజు మానస. ఎంతకాలం పెళ్ళిమాట ఎత్తకుండా తప్పించుకు తిరుగుతావని నిలదీసి ప్రశ్నించింది. బిడ్డను కన్న తర్వాత పెళ్ళి చేసుకుంటావా అని దెప్పి పొడిచింది. సుధీర్‌లో అసహనం పెరిగిపోతూ వుంది కోపంగా అన్నాడు.

"బిడ్డపుట్టిన తర్వాత నిన్ను పెళ్ళి చేసుకోడానికయినా సిద్ధపడతాను కానీ నా భార్యతో తెగతెంపులు చేసుకోకుండా నిన్ను కట్టుకునే ప్రశ్నేలేదు. అలా చేసానంటే కటకటాల వెనక్కి వెళ్ళాల్సి వస్తుంది. అందుకని విడాకులే ముందు .... పెళ్ళి తర్వాత" ఖచ్చితంగా చెప్పాడు సుధీర్! అతని సమాధానానికి కోపం మండిపోయింది మానసకు. "భార్యతో విడాకులు మంజూరు కాకుండానే నాకు కడుపు చేయటానికి ధైర్యం వున్నదికాని, పెళ్ళికి మాత్రం లేదు. ఛీ! నువ్వింత మోసగాడివని అనుకోలేదు. జీవితంలో నీ ముఖం చూస్తే ఒట్టు." విసవిసా నడిచిపోయింది మానస. తెల్లపోయాడు సుధీర్! ఆ తర్వాత కొద్ది నెలలకే భార్యతో విడాకులు మంజూరు అయ్యాయి! మానస కోసం వెతుక్కుంటూ వెళ్ళాడు. దుబాయ్ వెళ్ళి ఏదో ఉద్యోగంలో చేరిపోయిందని చెప్పారు. హతాశుడై నిల్చుండి పోయాడు రెండికీ చెప్ప లేవడు సుధీర్!

—ఇ. టి. రామారావు

శ్రీహరికోట

## ఫస్ట్ కేస్!!

సుజాత నాన్నగారు "జయలక్ష్మి ఇండస్ట్రీస్ ప్రొప్రైటర్ గంగాధరరావు లాయర్ సుధీర్‌కు స్వయానా మేనమామ. సుజాత, సుధీర్ పుట్టినప్పుడే భార్యాభర్తలుగా ముద్ర వేశారు ఇరువైపు పెద్దలూ. సుధీర్ "లా" చదవటం, ప్రాక్టీస్ పెట్టటం కూడా అయ్యింది. ఇక వాళ్ళ వివాహమే తరువాయి. కానీ.గంగాధరరావు ఒక ఆంక్ష పెట్టాడు. సుధీర్ స్వయంగా ఒక కేసు నెగ్గాలి. తరువాతే పెళ్ళి.

లాయర్ బోర్డు పెట్టి ఆర్నెల్లు అవటమే గానీ ఒక్కటంటే ఒక్క కేసు రాలేదు సుధీర్‌కి. "బావా! ఎప్పుడు కేసు నెగ్గటం? మనం ముసలి వాళ్ళయ్యాకనా" అంటూ సుజాత రోజూ ఆట పట్టించటమే. సుధీర్ చూస్తున్న సువర్ణావకాశం ఒక రోజు రానే వచ్చింది.

బాగా ఏడ్చి ఉబ్బిన కళ్ళతో ఆ రోజు చాలా ఆలస్యంగా వచ్చిన పనిమనిషి రంగిని సుధీర్ తల్లి అనసూయమ్మ "ఏమే ఈ రోజు పనికి ఇంతాలస్యం?" అంటూ ప్రశ్నించింది.

"ఇదంతా ఆ దొంగసచ్చినాడి నిర్వాకం అమ్మగారూ! రోజూ తాగొచ్చి నన్ను కొట్టటం ఆడు మామూలేనమ్మా. ఈ మధ్దిన ఎవత్తినో మరిగాడంట. నిలదీసి అడిగితే ఒళ్ళు హూనం సేశాడమ్మా" మొగుడి గురించి చెప్తూ కళ్ళు ఒత్తుకుంది రంగి.

"అయ్యో పాపం!" అంటూన్న అనసూయమ్మ మాటలకు అడ్డు తగిలాడు సుధీర్-

"రంగీ! నీ మొగుడి లాంటి వాళ్ళకి బాగా బుద్ధి చెప్పాలి. నీ సంపాదన కూడా హాయిగా తింటూ ఇలాంటి వెధవ పనులు చెయ్యటమా! వెంటనే విడాకులకు దరఖాస్తు పెట్టు. మీ వాడలోని వారితో రోజూ తాగొచ్చి నిన్ను బాదేస్తున్నాడని సాక్ష్యం ఇప్పిద్దాం. నీ తరపు నేను కేసు వేస్తా. ఇంకా నలుగురిళ్ళలో పని చేసుకొని నీ బతుకు నీవు బతకొచ్చు" లాయర్ సలహా ఇచ్చాడు సుధీర్. తలూపింది రంగి. ఆ రోజే రంగితో వేలిముద్రలు వేయించటం, విడాకులకు దరఖాస్తు పెట్టించటం కూడా అయ్యింది. మొదటి కేసు దొరికిన సుధీర్ ఆనందం వర్ణనాతీతం. సుజాతకు కూడా ఈ విషయం తెలిసింది. ఆ సాయంత్రమే బావ వద్దకు పరుగు పరుగున వచ్చింది.

"హాయ్ బావా! కంగ్రాట్స్. ఫైదిపై లైన్ క్లియర్ అయ్యింది కదా. నాన్నగారి దగ్గర కెళ్దాం పద. ఇక ఈ కేసు ఎలాగూ నువే గెలుస్తావుగా!"

"నో సుజీ! మీ నాన్న మాటను ఛాలెంజ్‌గా తీసుకున్నా. మా పనిమనిషి రంగికి విడాకులే ముందు. (మన) పెళ్ళి తర్వాత. నేను కేసు నెగ్గిన తర్వాతే మన పెళ్ళి జరుగుతుంది."

ఇంతలో "బాబు గారూ." అన్న మాటలు విని వెనుదిరిగి చూశారు సుధీర్, సుజాత.

ముందు రంగి, వెనుక మొగుడు నర్సిగాలు.

"బాబు గారూ! నేను ఇడాకులికి తమ దగ్గర కేసు ఏసినానని తెలిసి ఈడొచ్చి నా కాళ్ళట్టుకున్నాడు....బుద్ధిగా లెంప లేసుకొని ఎదవ్వేసాలెయ్యనని పెమానం గూడా సేసినాడయ్యా .... వాడు చేసిన తప్పొగ్గేసి నానయ్యా. నా కేసు ఎనక్కి తీసేస్కోండి బాబూ."

"హతోస్మి" అంటూ కుర్చీలో కూలబడ్డ సుధీర్‌ను చూచి కిలకిలా నవ్వటం సుజాత వంతయ్యింది.

—వి. వి. సుబ్రమణ్యంరావు

(పులివెందుల)

## ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

"స్వంత ఇల్లుండగా పార్కులో పడుకోవడానికి కారణం ఏమిటి?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ సత్యానంద్.